క్లుప్తంగా

నర్సరీ పరిశీలన



నర్సరీని పరిశీలిస్తున్న డీఆర్‌డీఓ శేఖర్‌రెడ్డి

చందంపేట : మండలంలోని ముడుదండ్ల గ్రామంలోని వన నర్సరీని శుక్రవారం డీఆర్‌డీ ఓ శేఖర్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన నర్సరీలో మొక్కల పెంపకం, ఏ ఏ మొక్కలను పెంచాలి, చేపట్టాల్సిన చర్యలపై పలు సూచనలు చేశారు. పంచాయతీ కార్యదర్శులు నర్సరీలో మొక్కల సంరక్షించాలని సూచించారు. ఆయన వెంట ఏపీఎం వరలక్ష్మి, సెక్రటరీలు రామలింగారెడ్డి, కిరణ్ పాల్గొన్నారు.

ఈవ్ టీజింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు

మిర్యాలగూడ అర్బన్ : కళాశాలలు, స్కూళ్లలో యువకులు ఈవ్ టీజింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ కె.రాజశేఖర్ రాజు హెచ్చరించారు. శుక్రవారం షీ టీం ఆధ్వర్యంలో వన్‌టౌన్, టూటౌన్ పరిధిలోని కళాశాలలు, స్కూళ్ల వద్ద పోలీసులు సివిల్ దుస్తుల్లో ఉండి ఆడపిల్లలు, యువతులపై అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నారనే సమాచారంతో మాటు వేసి ప్రత్యేక తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా అనుచిత ప్రవర్తన చేస్తున్న పదిమంది అనుమానితులను ఆదుపులోకి తీసుకుని డీఎస్పీ కార్యాలయానికి తరలించారు. అనంతరం డీఎస్పీ మాట్లాడారు. షీటీం పోలీసులు ప్రతి నిత్యం ప్రజల్లో ఉండి ఆకతాయిలను గుర్తించి తగిన చర్యలు తీసుకుంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో టూ టౌన్ సీఐ నాగార్జున, రూరల్ సీఐ వీరబాబు ఏఎస్ఐ ప్రభాకర్, షరీఫ్, సిబ్బంది రాజేశ్వరి, మధు, రవిందర్ పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి



సమావేశంలో మాట్లాడుతున్న దయానంద్

మిర్యాలగూడ : పెండింగ్‌లో ఉన్న మధ్యాహ్న భోజన కార్మికుల బిల్లులను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని సీఐటీయూ మండల కన్వీనర్ బైరం దయానంద్, మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షురాలు ఎస్‌కె. కరీమున్నీసాలు కోరారు. శుక్రవారం దామరచర్ల మండల కేంద్రంలో వారు మాట్లాడుతూ కార్మికులకు పెండింగ్‌లో వేతనాలు, గుడ్ల బిల్లులు చెల్లించి ఆదుకోవాలన్నారు. ప్రభుత్వం గ్యాస్ కనెక్షన్లను సబ్సిడీతో అందించాలని, కొత్త వంట పాత్రలను అందించాలని, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని కోరారు. డిమాండ్ల పరిష్కారం కోసం ఈనెల 16, 17తేదీల్లో నల్లగొండ కలెక్టరేట్ ఎదుట నిర్వహించే ధర్నాలో మధ్యాహ్న భోజన కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో లక్ష్మమ్మ, శాంతమ్మ, బుజ్జమ్మ పాల్గొన్నారు.

'చలో గుంటూరు' పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న తాళ్లపల్లి రవి

మిర్యాలగూడ టౌన్ : ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరులో ఈనెల 15న నిర్వహించనున్న మహాగర్జన పోస్టర్‌ను మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు తాళ్లపల్లి రవి, రాష్ట్ర ఉపాధ్యక్షులు ముండ్లగిరి కాంతయ్యలు శుక్రవారం ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు రాజ్యాంగ వ్యతిరేకమని, ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ల వర్గీకరణ, క్రిమిలేయర్ తీర్పును రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ గుంటూరులో మాలల మహాగర్జనను అఖిల భారత మాలల సంఘాల జేఏసీ చేపట్టినట్లు తెలిపారు. 'ఎస్సీ వర్గీకరణ వద్దు..కలిసి ఉంటేనే ముద్దు' అనే నినాదంతో ముందుకు వెళ్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాలమహానాడు ఉద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు మాడుగుల శ్రీనివాస్, మాలమహానాడు జాతీయ మహిళా అధ్యక్షురాలు పున్నమ్మ, మాలమహానాడు రాష్ట్ర మలమహానాడు కార్యదర్శి బొప్పని నగేష్, నాయకులు ఎర్రమాద దినేష్, పేరుళ్ల ధనమ్మ, మట్టయ్య ఉన్నారు.

23 నుంచి ఏబీవీపీ రాష్ట్ర మహాసభలు

నల్లగొండ టూటౌన్ : సిద్దిపేటలో ఈ నెల 23 నుంచి 25వరకు ఏబీవీపీ రాష్ట్ర మహాసభలు జరుగుతాయని ఆ సంఘం జిల్లా కన్వీనర్ ఆవుల సంపత్‌కుమార్ తెలిపారు. శుక్రవారం స్థానిక ఎన్జీ కాలేజీలో రాష్ట్ర మహాసభల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ఏబీవీపీ పోరాడుతుందని పేర్కొన్నారు. మహాసభలకు విద్యార్థులు, మేధావులు, నిరుద్యోగులు హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు విగ్నేష్, శివాజీ, చరణ్, నవీన్, పాల్గొన్నారు.

కాజ్‌వేల కష్టాలు తీరేదెప్పుడో!

- నిరంతర నీటి ప్రవాహంతో నాచుపట్టిన రహదారి
- ప్రమాదాలకు గురువుతున్న వాహనదారులు
- బ్రిడ్జిలు నిర్మించాలని ప్రజల వేడుకోలు

గుర్రంపోడు : మండలంలో పలు గ్రామాల మధ్య గల కాజ్‌వేల స్థానంలో బ్రిడ్జిల నిర్మాణాలకు ప్రతిపాదనల అమలుకు నోచుకోవడం లేదు. మండలంలో పలు చోట్ల గతంలో భూ మట్టంలో నిర్మించిన కాజ్‌వేల మీదుగా ఇరువైపులా నీరు ప్రవహిస్తుండంతో జీవనదుల్లా పారుతున్నాయి. ఏఎమ్మార్పీ ఆయకట్టులో కాల్వల నీరు ఈ కాజ్‌వేల గుండా ప్రవహిస్తుడంటంతో ఎడాది పొడవునా నీరును దాటుకుంటూ ప్రయాణించడం ఇబ్బందిగా ఉంది. తాత్కాలికంగా వర్షానికి వచ్చిన వరద నీరు వెళ్లేందుకే ఈ కాజ్‌వేలు గతంలో నిర్మించారు. కొన్ని చోట్ల నాచుపట్టి వాహనాలు జారి ప్రమాదాలు గురవుతున్నాయి. కాజ్‌వేలను కల్వర్టులుగా మార్చాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



తానేదార్‌పల్లి- జానూతుల మధ్యలో కాజ్‌వే మీదుగా ప్రవహిస్తున్న నీరు



ఆమలూరు-నడికూడ గ్రామాల మధ్య కాజ్‌వేపై నుంచి ప్రవహిస్తున్న నీరు

కాజ్‌వే లు ఇవే..

మండంలలోని నల్లగొండ- దేవరకొండ ప్రధాన రహదారి నుంచి లక్ష్మీదేవి గూడెం వెళ్లే దారిలో, బొల్లారం- నడికూడ గ్రామాల మధ్య, చేపూరు- తెరాటిగూడెం గ్రామాల దారిలోచ వెంకటాపురం- ఉట్లపల్లి గ్రామాల దారిలో, తేనపల్లి- ముల్కలపల్లి గ్రామాల మధ్య, వట్టికోడు-కస్తాల మధ్య, కోనాయిగూడెం- బ్రమ్మణగూడెంల మధ్య, మొసంగి- తెరాటిగూడెం గ్రామాల మధ్య కాజ్‌వేలు ఉన్నాయి.

జీవనదుల్లా కాజ్‌వేలు

ఏఎమ్మార్పీ ఆయకట్టులోని కాజ్‌వేలు ఇరువైపులా పంట పొలాలు, చెరువులు, కుంటలు అలుగులు పోస్తుండటంతో జీవనదుల్లా పారుతున్నాయి. పొలాలు నీరు కాజ్‌వేల మీదుగా ప్రవహిస్తుండటంతో కాజ్‌వేలపై నాచుపట్టడంతో వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయి.

ప్రతిపాదనలు పంపాం



మండలంలో శశిలేటి వాగు నీరు ప్రవహించే కొత్తలాపురం -మొసంగి గ్రామాల మధ్య, చేపూరు -కొత్తలాపురం గ్రామాల మధ్య కాజ్‌వేలను బ్రిడ్జిలుగా మార్చేందుకు ఒక్కో కాజ్‌వేకు 90 లక్షల చొప్పున నిధులు ఇటీవల మంజూరైనాయి. మిగతా గ్రామాల మధ్య కాజ్‌వేలను ఎత్తు పెంచి క్రింది భాగంలో గూనలు వేసి బ్రిడ్జిలు మార్చేందుకు ప్రతిపాదనలు పంపుతాం.

– శ్రీనివాసరావు, పీఆర్ ఏఈ

బ్రిడ్జిలుగా మార్చాలి



ప్రమాదకరంగా మారిన కాజ్‌వేలను బ్రిడ్జిలుగా మార్చాలి. రైతులు సరకు రవాణాలో తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుంది. గతంలో ప్రమాదాలు జరిగిన సంఘటనలు ఉన్నాయి. ఆయకట్టులోని కాజ్‌వేలన్నింటిని బ్రిడ్జిలుగా మార్చాలి.

– వడ్డగోని యాదగిరి గౌడ్, నడికూడ

నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయం

- దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్



రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

దేవరకొండ : నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా ముందుకెళ్తున్నట్లు ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ తెలిపారు. శుక్రవారం దేవరకొండ మండలం తాటికోల్ నుండి గొల్లపల్లి గ్రామం మీదుగా కొమ్మేపల్లి వరకు నిర్మాణం చేపట్టనున్న బీటీ రోడ్డు నిర్మాణ పనులను ఆయన ప్రారంభించి మాట్లాడారు. గత ప్రభుత్వాల నిర్లక్ష్యం కారణంగా అభివృద్ధి కుంటుపడిందని ఆయన ఆరోపించారు. రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని అధికారులకు ఆయన సూచించారు. నియోజకవర్గ పరిధిలోని ఆయా ఆవాసాలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రణాళికాబద్ధంగా ముందుకె ళ్తున్నట్లు తెలిపారు. అనంతరం స్థానిక అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆయన పరిశీలించి చిన్నారులతో ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో నాయకులు నల్లగాజు జాన్‌యాదవ్, సురేష్‌గౌడ్, ధనలక్ష్మీ బాలనారయణగౌడ్, శ్రీధర్‌రెడ్డి, రుక్మా రెడ్డి, కొర్ర రాంసింగ్, వెంకటేశ్వరరావు, బద్యానాయక్, కాటంగౌడ్, రవిగౌడ్, అధికారు లు, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక..

గుడిపల్లి మండలానికి చెందిన పలువురు బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు శుక్రవారం దేవరకొండ పట్టణంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో ఎమ్మెల్యే బాలునాయక్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారికి పార్టీ కండువాలు కప్పి ఆయన పార్టీలోకి ఆహ్వానించారు..అనంతరం ఆయన మాట్లాడుతూ బడుగు,బలహీన వర్గాల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కుక్కల గోవర్ధన్‌రెడ్డి, ఎల్లయ్యయాదవ్, బొద్యానాయక్, సతీష్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సత్యనారా యణరెడ్డి, చంద్రారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్‌తో పేదలకు ప్రయోజనం



లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి

హాలియా : ముఖ్యమంత్రి సహాయ నిధితో పేదలకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి పేర్కొన్నారు. సాగర్ నియోజకవర్గంలోని వివిధ గ్రామాలకు చెందిన 36మందికి సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరైన రూ.9,73,000 విలువ గల చెక్కులను శుక్రవారం తిరుమలగిరి(సాగర్) మండల కేంద్రంలో లబ్ధిదారులకు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ చైర్మన్లు కేవీ రామారావు, ఎక్కలూరి శ్రీనివాస్ రెడ్డి, మాజీ జెడ్పీటీసీ సూర్యభాష్యా నాయక్, అనుముల మాజీ ఎంపీపీ సలహాదారు పెద్దిరాజు యాదవ్, మాజీ బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బీవీ రమణ రాజు, మండల బీఆర్‌ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి వెంకట్‌రెడ్డి, నాయకులు నాసర్ రెడ్డి, కోటియా నాయక్, కృష్ణారెడ్డి, పోలేపల్లి ఆంజనేయులు, ముత్తయ్య, శంకర్, బిచ్చనాయక్, రంగసాయి, కుద్రదేవ్ నాయక్, అంజి యాదవ్, బాలునాయక్, వెంకన్న, ఖాసీం, మధు తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతనం రూ.18వేలు చెల్లించాలి

నాగార్జునసాగర్ : కనీస వేతనం రూ.18వేలు చెల్లించాలని నందికొండ మున్సిపాలిటీ మెప్మా ఆర్పీలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లో నిర్వహించే సమ్మెలో పాల్గొనేందుకు వెళ్తుండగా ఇంటి వద్దే సాగర్ పోలీసులు అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌లో పెట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వం నాలుగు వేలు ఇచ్చే వేతనాన్ని రూ.2వేలు పెంచి రూ.6వేలు చేసిందని తెలిపారు. గత ఎనిమిది నెలలుగా వేతనాలు ఇవ్వడం లేదని వాపోయారు. ఈ కార్యక్రమంలో ఆర్పీలు అనంతలక్ష్మి, వరలక్ష్మి, రేణుక, నాగమణి, విశాలాక్షి, సింధు, లావణ్య, ఉన్నారు.



సాగర్ పోలీస్ స్టేషన్‌లో మోప్మా ఆర్పీలు

మెరుగైన విద్య అందించడమే లక్ష్యం



కేజీబీవీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ : ప్రభుత్వ పాఠశాలల్లో బాలికలకు మెరుగైన విద్య అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని ఆలగడప గ్రామంలో నూతనంగా రూ.3.25కోట్లతో నిర్మించనున్న కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయ భవన నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద విద్యార్థినులకు ఉన్నత విద్యను అందించాలనే లక్ష్యంతో ఇంటర్మీడియేట్ కళాశాల భవన నిర్మాణం చేయనున్నట్లు తెలిపారు. ప్రభుత్వం పేద, మధ్య తరగతి విద్యార్థులకు మెరుగైన వసతులతో కూడిన విద్యను అందించేందుకు కేజీబీవీ, మోడల్, రెసిడెన్షియల్ పాఠశాలల్లో 40శాతం డైట్, కాస్మోటిక్ ఛార్జీలను పెంచి వారికి అండగా ఉందన్నారు. కళాశాల భవనాన్ని త్వరగా పూర్తి చేసి వచ్చే విద్యా సంవత్సరం వరకు తరగతులు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ హరిబాబు, ఎంఈవో బాలు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిని ఆక్రమిస్తే కఠిన చర్యలు



ప్రభుత్వ భూమిలో బోర్డు ఏర్పాటు చేసిన అధికారులు

మిర్యాలగూడ : ప్రభుత్వ భూములను ఆక్రమించినా, క్రయ, విక్రయాలు చేపట్టినా వారిపై క్రిమినల్ చర్యలు తీసుకుంటామని సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్ హెచ్చరించారు. శుక్రవారం పట్టణ శివారులోని సర్వే నంబర్ 60, 61లలోని 12.14ఎకరాల సీలింగ్ ల్యాండ్ ఉందని, 1978లో కొంతమంది రైతులకు వ్యవసాయం చేసుకోవడానికి ఇచ్చినట్లు తెలిపారు. ఆ భూమిని అమ్మకాలు, కొనుగోలు చేయకూడదన్నారు. ప్రస్తుతం 1.18 ఎకరం ఖాళీ భూమిని గుర్తించినట్లు తెలిపారు. ఆ భూమిని ఎవరూ ఆక్రమించకుండా రెవెన్యూశాఖ ఆధ్వర్యంలో బోర్డు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ ప్రభుత్వ భూమిని కబ్జా చేసేందుకు ప్రయత్నం చేస్తే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. ఆయన వెంట తహసీల్దార్ హరిబాబు, ఆర్ఐ ఠాకూర్ రామకృష్ణ, సర్వేయర్ ఖాద్రిలు ఉన్నారు.

దాతల సహకారంతో పాఠశాల అభివృద్ధి



విద్యార్థులకు టై, బెల్ట్‌లు పంపిణీ చేస్తున్న ఎంఈఓ బాలునాయక్

మిర్యాలగూడ టౌన్ : దాతల సహకారంతో పాఠశాల అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతుందని మండల విద్యాధికారి లావూరి బాలునాయక్ అన్నారు. మండలంలోని అవంతీపురంలోని ప్రాథమిక పాఠశాలలో పట్టణానికి చెందిన జనయేత్రి సంస్థ వ్యవస్థాపకులు మునీర్ కుమారుడు షరీఫ్ పుట్టిన రోజు సందర్భంగా విద్యార్థులకు టై, బెల్ట్‌లు, గుర్తింపు కార్డులు అందజేశారు. శుక్రవారం ఎంఈఓ విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలగడప కాంప్లెక్స్ ఇన్‌చార్జ్ హెచ్‌ఎం వి. శ్రీనివాస్‌రావు, అవంతిపురం ప్రభుత్వ పాఠశాల హెచ్‌ఎం చింత మధు, ఉపాధ్యాయులు డోరతి, రవీందర్‌రెడ్డి, వేణుధర్, సాల్మన్‌లతో పాటు మణి, నాగమణి తదితరులున్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పెన్నులు, పండ్లు పంపిణీ

పట్టణంలోని ఈదులగూడెం పాఠశాలలో పండ్లు, పెన్నులు, మండలంలోని అవంతిపురంలో గల వృద్ధాశ్రమంలో బ్రెడ్, పండ్లను లయన్స్ క్లబ్ ఆఫ్ మిర్యాలగూడ ఆధ్వర్యంలో శుక్రవారం పంపిణీ చేశారు. ఈదులగూడెం పాఠశాలలో కౌన్సిలర్లు ముదిరెడ్డి నర్సిరెడ్డి, బండి యాదగిరిరెడ్డిల అందజేశారు. అనంతరం పాఠశాలలో విద్యార్థు కూర్చునేందుకు పాఠశాల హెచ్‌ఎం రమావత్ లాలుకు మ్యాట్ కోసం క్లబ్ రూ.5 వేలు అందజేసింది. ఈ కార్యక్రమంలో ఈకార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు యనగండ్ల లింగయ్య, క్లబ్ కార్యదర్శి జె. మల్లారెడ్డి, కోశాధికారి బీఎం నాయుడు, దివ్యాంగుల క్లబ్ అధ్యక్షులు సింగు రాంబాబు, భాస్కర క్లబ్ అధ్యక్షులు కర్ర రాంరెడ్డి, అమ్మ ఆదర్శ కమిటీ అధ్యక్షురాలు కవితసైదులు, స్థానికులు వెంకటేశ్వర్లు, రాఘువారెడ్డి, మారయ్య తదితరులున్నారు.

క్రీడాకారులను ప్రోత్సహించేందుకు సీఎం కప్



మిర్యాలగూడ : క్రీడాకారులతో కబడ్డీ ఆడుతున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి



డిండి : సీఎం కప్ క్రీడలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బాలునాయక్

డిండి : రాష్ట్రంలోని క్రీడాకారుల ప్రోత్సహించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని జెడ్పీహైస్కూల్లో ఏర్పాటు చేసిన సీఎం కప్ మండల స్థాయి కబడ్డీ పోటీలు, మండల పరిధిలోని కాల్యాతండాల్లో ఏర్పాటు చేసిన ఆర్‌ఓ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించి మాట్లాడారు. ఈ సందర్భంగా గ్రామీణ స్థాయిలోని క్రీడాకారుల నైపుణ్యతను గుర్తించేందుకు గాను ప్రజా పాలనా విజయోత్సవాల్లో భాగంగా ప్రభుత్వం సీఎం కప్ పోటీలు నిర్వహిస్తుందన్నారు. అనంతరం మండలంలోని రాస్యతండా వద్ద కొనసాగుతున్న బీటీరోడ్డు పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఆంజనేయులు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, మండలాధ్యక్షుడు రాజేష్‌రెడ్డి, యూత్ అధ్యక్షుడు సాయికుమార్, శ్రీనివాస్, నాగార్జున్‌రెడ్డి, రాంకిరణ్, రేఖ్యానాయక్, లోక్యానాయక్, కొండలు, తేజు, వెంకటేష్, సలయ్య, వేణు పాల్గొన్నారు.

క్రీడాకారులు ప్రపంచ స్థాయికి ఎదగాలి

మిర్యాలగూడ : ప్రతిభ కలిగిన గ్రామీణ క్రీడాకారులను ప్రపంచ స్థాయికి ఎదిగేందుకు రాష్ట్ర ప్రభుత్వం సీఎం కప్ క్రీడా పోటీలను నిర్వహిస్తుందని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న మండల స్థాయి క్రీడలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. యువత క్రీడల్లో రాణించాలని, ప్రతిభ కలిగిన క్రీడాకారులు కేవలం పల్లెల్లో పరిమితమై పోకుండా ప్రపంచస్థాయికి ఎదగాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సీఎం కప్ పోటీలను నిర్వహిస్తూ ప్రోత్సహిస్తున్నారన్నారు. క్రీడలు విద్యార్థులను, యువకులను శారీరకంగా కాకుండా మానసికంగా బలంగా తయారు చేస్తుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలి

వేములపల్లి(మాడుగులపల్లి) : విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించినట్లయితే మంచి భవిష్యత్ ఉంటుందని ఎంపీడీఓ తిరుమలస్వామి అన్నారు. శుక్రవారం మాడ్గులపల్లి మండల కేంద్రంలోని సెవెంత్‌డే స్కూల్‌లో మండలస్థాయి సీఎం కప్ పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. క్రీడల వల్ల విద్యార్థుల్లో మానసిక, శారీరక దారుఢ్యం అలవడుతుందన్నారు. మండల స్థాయిలో నిర్వహించిన ఖోఖో, కబడ్డీ, వాలీబాల్ పోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థులను జిల్లా స్థాయికి ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.

లగచర్ల కేసులో రైతులను వేధిస్తున్న సర్కార్

మిర్యాలగూడ అర్బన్ : లగచర్ల గిరిజన రైతులకు బేడీలు వేసి ప్రభుత్వం వేధిస్తుందని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ముడావత్ రవినాయక్ అన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. హీర్యానాయక్ అనే రైతుకు గుండెపోటు వచ్చిందని, అయినా కనుకరించకుండా కరుడు గట్టిన ఖైదీలకు బేడీలు వేసి ఆస్పత్రికి తీసుకెళ్లడం కాంగ్రెస్ ప్రభుత్వం నిరంకుశత్వానికి నిదర్శనమన్నారు. గిరిజనులు, పేద రైతులపై అక్రమ కేసులు పెట్టి చిత్రహింసలకు గురిచేస్తుందన్నారు. లగచర్ల భూ ఉద్యమంలో పేద రైతులపై పెట్టిన కేసులను భేషరత్‌గా ఎత్తివేయాలని, సంగారెడ్డి సెంట్రల్ జైల్ నుండి తక్షణం విడుదల చేయాలని లేకపోతే రాష్ట్ర వ్యాప్త ఉద్యమానికి పూనుకుంటామని హెచ్చరించారు.

రైతుకు బేడీలు వేయడం నిరంకుశత్వానికి నిదర్శనం

మిర్యాలగూడ : లగచర్ల ఫార్మా కంపెనీలకు వ్యతిరేకంగా ఉద్యమించిన గిరిజన రైతు హీర్యానాయక్‌కు బేడీలు వేయడం ప్రభుత్వ నిరంకుశత్వానికి నిదర్శనమని తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు ధీరావత్ శ్రీనునాయక్ అన్నారు. గిరిజనులు, దళితులను, పేద రైతులపై అక్రమంగా కేసులు పెట్టి సంగారెడ్డి సెంట్రల్ జైల్‌లో ఖైదీలుగా చేసి చిత్రహింసలకు గురిచేయడంతో గిరిజన రైతుకు గుండెపోటు వచ్చిందని, అయినా కనుకరించకుండా కరుడుగట్టిన ఖైదీలకు బేడీలు వేసి ఆసుపత్రికి తీసుకెళ్లడం దారుణమన్నారు. కేసులను బేషరుతుగా ఎత్తివేయాలని ఆయన డిమాండ్ చేశారు.

పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



చెన్నాయిపాలెంలో పశువులకు వైద్యం చేస్తున్న డాక్టర్ నాగేందర్

త్రిపురారం : పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే పశువైద్య శిబిరాలు రైతులు సద్వినియోగం చేసుకోవాలని త్రిపురారం మండల పశువైద్యాధికారి డాక్టర్ నాగేందర్ అన్నారు. శుక్రవారం మండలంలోని చెన్నాయిపాలెంలో గోపాల మిత్రలతో కలసి గర్భకోశ వ్యాధి నివారణ కార్యక్రమంలో భాగంగా ఉచిత పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని 42గేదెలకు పలు రకాల వ్యాధులు నిర్వహించి ఉచితంగా మందులు అందించడంతో పాటుగా 25దూడలకు నట్టల నివారణ మందును తాగించినట్లు తెలిపారు. రైతులు తమ పశువులకు సకాలంలో చికిత్సలు చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమలో సిబ్బంది రాహుల్, శివారెడ్డి, అశోక్, సందీప్ రైతులు తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ మాలధారుల ఇరుముడి



ఇరుముడిని స్వీకరిస్తున్న హనుమాన్ మాలధారులు

డిండి : మండల కేంద్రంలోని శ్రీ చెన్నకేశవ స్వామి ఆలయంలో ఇరుముడి కార్యక్రమాన్ని శుక్రవారం హనుమాన్ మాలధారులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికులతోపాటు ఇతర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో తరలిరావడంతో ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. భక్తులకు అన్నదానం చేశారు. అనంతరం ఇరుముడి స్వీకరించిన భక్తులు తమ మొక్కులను చెల్లించేందుకు నాగర్‌కర్నూల్ జిల్లాలోని మద్దిమడుగు ఆంజనేయ స్వామి దేవస్థానానికి బయలుదేరారు. ఈ కార్యక్రమంలోరమేష్, ప్రతాప్. శేఖర్, నీరంజన్, అనిల్, మల్లేష్, రాజు, శ్రీను, ఆంజనేయులు, మల్లయ్య, రాము, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

రెండు లక్షల ఉద్యోగాల భర్తీ ఏమైంది?



మాట్లాడుతున్న డీవైఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లం మహేశ్

హాలియా : కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం మొదటి ఏడాది రెండు లక్షల ఉద్యోగాల భర్తీ ఏమైందని డీవైఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లం మహేష్ ప్రశ్నించారు. శుక్రవారం హాలియాలో నిర్వహించిన ఆ సంఘం ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఏటా రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చి ఇప్పటి వరకు పదివేలలోపు మాత్రమే ఉద్యోగాలు ఇచ్చిందన్నారు. గత నోటిఫికేషన్ భర్తీ చేసి జాబ్ క్యాలెండర్ ప్రకటించింది కానీ దాని ప్రకారం ఉద్యోగాల భర్తీ జరగలేదన్నారు. వెంటనే ఖాళీగా ఉన్న ఉద్యోగాలన్నింటిని భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ నాయకులు మూరుగుండ్ల ప్రశాంత్, ప్రణవునాథ్, సుదర్శన్, హరీష్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మట్టి తరలింపును అరికట్టాలని వినతి

మిర్యాలగూడ : మండలంలోని అవంతీపురంలో నిజాం షుగర్ ఫ్యాక్టరీ(ఎన్‌ఎస్ఎఫ్)భూముల్లో నుంచి అక్రమంగా మట్టి తరలింపును అడ్డుకోని వారిపై చర్యలు తీసుకోవాలని ఎన్ఎస్ఎఫ్ వీఆర్ఎస్ ఎంప్లాయీస్ వెల్ఫేర్, హౌసింగ్ సొసైటీ నాయకులు కోరారు. శుక్రవారం వారు సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్‌కు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. నిజాం షుగర్ ఫ్యాక్టరీ భూములను తమకు ఇళ్ల ప్లాట్లు ఇవ్వడంపై హైకోర్టులో కేసు నడుస్తుందని, భూములు అన్యాక్రాంతం కాకుండా స్టే ఇచ్చిందన్నారు. ఉన్నతాధికారులు స్పందించి ఎన్ఎస్ఎఫ్ భూముల్లో మట్టి అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. వినతిపత్రం అందించిన వారిలో మోహన్‌రావు, రాములు, సంక్రంనాయక్ తదితరులు పాల్గొన్నారు.



సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు



నసర్లపల్లి వద్ద ప్రమాద సూచికలు పరిశీలిస్తున్న ఎస్ఐ యాదయ్య

చింతపల్లి : హైదరాబాద్- నాగార్జునసాగర్ రాష్ట్ర రహదారిపై ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్టు ఎస్ఐ యాదయ్య తెలిపారు. శుక్రవారం మండల పరిధిలోని నసర్లపల్లి ఎక్స్‌రోడ్డు వద్ద అతివేగంతో వెళ్తున్న వాహనాల వేగం తగ్గించడానికి బొలాడ్స్, ఫ్లైడ్‌లైట్స్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాన రహదారిపై ఉన్న గ్రామాల వద్ద రోడ్డు ప్రమాదాలను నివారించడానికి బొలాడ్స్ ఫ్లడ్లైట్లను ఏర్పాటు చేస్తున్నట్టు ఆయన పేర్కొన్నారు. మండలంలోని నసర్లపల్లి గ్రామం వద్ద వాహనదారులకు ఈ బొలాడ్స్ ఫ్లైట్ లైట్లు కిలోమీటర్ దూరం నుంచే కనిపిస్తాయని, అందుకు అనుగుణంగా వాహన చోదకులు తమ వాహనాల వేగాన్ని తగ్గించి సురక్షితంగా వెళ్లాలని ఆయన సూచించారు.